ప్రజాశక్తి
గురువారం 24 ఆగస్టు 2023
5
శ్రీ సత్యసాయి





కాలువిరిగిన మున్సిపల్ కార్మికుడు వెంకటేష్‌తో పాటు, మరికొందరని ముందస్తు అరెస్టు చేసి పుట్టపర్తి స్టేషన్‌లో ఉంచిన పోలీసులు



పెద్దిరెడ్డి మాటలు ఉత్తవేనా..!

- తొమ్మిది గంటలు నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నామని మంత్రి ఉపదేశం
- క్షేత్రస్థాయిలో వ్యవసాయానికి అందని విద్యుత్
- కరెంట్ లేక ఎండుతున్న పంటలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'జిల్లాలోనున్న 2,09,325 వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు తొమ్మిది గంటలు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాం. నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు రూ.979 కోట్లు ఖర్చు చేసి లో ఓల్టేజీ నుంచి హై ఓల్టేజీ డిస్ట్రిబ్యూషన్ సిస్టంకు మార్చాం..' అంటూ అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆగస్టు 15వ తేదీన అనంతపురం నగరంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల ప్రసంగంలో చెప్పారు. ఆచరణలో చూస్తే వ్యవసాయానికి తొమ్మిది గంటలు కాదు...గదా ఆరు గంటలు కూడా సక్రమంగా ఇవ్వని పరిస్థితి నెలకొంది. ఎప్పుడు కరెంటు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియక రైతులు పొలాల్లోనే రాత్రీ,పగలు పడిగాపులు కాసే పరిస్థితులు నెలకొన్నాయి.

ఎండుతున్న పంటలు

అనంతపురం రూరల్ మండలం పరిధిలోని మన్నీల గ్రామంలో మొత్తం వ్యవసాయ భూమి 3500 ఎకరాలుంది. ఇందులో సుమారు రెండు వేల ఎకరాల్లో బోరు బావుల కిందనే పంటలు సాగవుతాయి. వ్యవసాయ మోటర్లతోనే ఉద్యానవన పంటలతోపాటు వేరుశనగ వంటి పంటలు సాగవుతున్నాయి. ఈ గ్రామంలో మూడు రోజులుగా సక్రమంగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. దీనిపై రైతులు బుధవారం నాడు సబ్ స్టేషన్ ఎదుట ఆందోళన సైతం చేపట్టారు. విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరాలో అంతరాయంపై సరైన సమాచారం సైతం చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఇది ఒక్క మన్నీల గ్రామం పరిస్థితితే కాదు. జిల్లాలోని అనేక గ్రామాల్లోనూ ఇదే విధంగా ఉంది. ఒకవైపు వర్షాల్లేక ఇబ్బందులు పడుతున్న సమయంలో ఉన్న పంటనైనా రక్షించకుందామంటే కరెంటు సమససమస్య తీవ్రంగా ఉంది.



విద్యుత్ కోతలతో మన్నీల గ్రామంలో ఎండిన వేరుశగన పంట

పది ఎకరాల్లో వేరుశనగ ఎండిపోతోంది

పది ఎకరాల్లో వేరుశనగ పంటను సాగు చేశాం. మూడు లక్షలు రూపాయలు పెట్టుబడి పెట్టాను. ఒకవైపు వర్షాల్లేక సమస్యగా ఉంది. మరో వైపు పంట ఎండిపోకుండా కాపాడుకుందామంటే బోరు బావుల్లో నీరున్నా పంట పెట్టుకోవడానికి వీల్లేకుండా కరెంటు ఉండటం లేదు. ఎప్పుడు వస్తుందో కూడా తెలియక పొలాల్లోనే రాత్రీపగలు పడిగాపులు కాసే పరిస్థితి నెలకొంది. మంచి ఊడలు దిగే సమయంలో నీళ్లు లేక పోతే పంట దిగుబడి ఏ మాత్రం అందదు.

ఓబులయ్య, రైతు, మన్నీల గ్రామం.

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలి

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందివ్వాలి. ఏ సమయంలో విద్యుత్ సరఫరా అందిస్తామన్నది ముందుగానే సమాచారం అందివ్వాలి. దీంతో రైతులు ఆ సమయానికి రైతులు పొలాలోకెళ్లి పంటకు నీళ్లు పెట్టుకునే పరిస్థితి నెలకొంది.

రామాంజినేయులు,
జిల్లా నాయకులు ఎపి రైతు సంఘం.

అరెస్టులు... గృహ నిర్బంధాలు

మున్సిపల్ కార్మికులపై పోలీసుల ఆంక్షలు

ఎక్కడికక్కడ అడ్డగింతలు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సమస్యలను పరిష్కరించాలని శాంతియుతంగా నిరసన తెలిపేందుకు చలో విజయవాడకు వెళ్తున్న మున్సిపల్ కార్మికులపై పోలీసులు ఆంక్షలు విధించారు. ఇంటినుంచి కదిలేందుకు వీల్లేదంటూ కార్మికులు, మున్సిపల్ యూనియన్ నాయకులను మంగళవారం రాత్రి నుంచి నిర్బంధించారు. గృహ నిర్బాంధాలు, ముందస్తు అరెస్టులతో కార్మికులను భయభ్రాంతులకు గురి చేశారు. తాము న్యాయమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు వెళ్తున్నామని కార్మికులు చెప్పినా పోలీసులు వినలేదు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేసి, కార్మికులను అరెస్టులు చేశారు. పోలీసుల తీరుపై జిల్లా వ్యాప్తంగా కార్మిక, ప్రజాసంఘాల నాయకులు తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోని వివిధ మున్సిపాల్టీల్లో పని చేసే కార్మికులు చలో విజయవాడకు బయల్దేరేందుకు సిద్ధం అయ్యారు. ఈ నేపథ్యంలో పుట్టపర్తితో పాటు అన్ని మున్సిపాల్టీల్లోనూ పోలీసులు కార్మికులను ఎక్కడికక్కడ నిర్బంధించారు. నిర్బంధంలోకి తీసుకొని ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీస్ స్టేషన్‌లోనే ఉంచుకున్నారు. గురువారం నాడు విజయవాడలో జరిగే ధర్నాకు వెళ్లకుండా అడ్డుకున్నారు. పుట్టపర్తిలో మున్సిపల్ కార్మికులు పెద్దన్న, రామయ్య, గోవిందు, నర్సింహులు నాగార్జున, వెంకటేశు, రామదాసు పి.వెంకటేశు, రమణ తదితరులను అరెస్టు చేసి స్టేషన్‌లో ఉంచారు. అమడగూరులో మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మినారాయణను అరెస్టు చేసి నల్లమాడ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

అరెస్టులు దారుణం
ఇఎస్.వెంకటేష్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

శాంతియుతంగా సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన తెలిపేందుకు వెళ్తున్న మున్సిపల్ కార్మికులు, యూనియన్ నాయకులను పోలీసులు అరెస్టులు, గృహ నిర్బంధాలు చేయడం దుర్మార్గమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్.వెంకటేష్ తెలిపారు. కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తే ఆందోళనలు చేయాల్సిన అవసరం ఉండదన్నారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, ఇది మరింత ఉధృతం అవుతుందని హెచ్చరించారు.

కాలువిరిగినా కనికరం చూపలేదు..

పుట్టపర్తి మండలం ఎనుములపల్లికి చెందిన మున్సిపల్ కార్మికుడు వెంకటేశుకు ఇటీవల ఓ ప్రమాదంలో కాలు విరిగింది. మరో వ్యక్తి సహాయం లేనిదే ఆయన నడవలేని పరిస్థితి. కాలు విరగిన నేపథ్యంలో ఆయన గత కొన్ని రోజులుగా ఇంట్లోనే ఉండి విశ్రాంతి తీసుకుంటున్నాడు. నడవలేని స్థితిలో ఉన్న ఈయన్ను కూడా పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. తాను కాలినొప్పితో బాధపడుతున్నానని, విజయవాడ వెళ్లడం లేదని కార్మికుడు వెంకటేశుపోలీసులను బ్రతిమలాడినా వారు కనికరం చూపలేదు. ఉదయం ఇంటి నుంచి తీసుకెళ్లి సాయంత్రం వరకు పుట్టపర్తి పోలీసు స్టేషన్‌లోనే ఉంచుకున్నారు. కాలినొప్పితో ఆయన బాధపడుతున్నా పోలీసులు స్పందించకుండా మిన్నకుండిపోయారు.

'గుడ్‌మార్నింగ్'లో సమస్యలు కనిపించవా..? : పరిటాల



వృద్ధుడికి నమస్కరిస్తున్న పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలో పలు కాలనీల్లో రోడ్లు సక్రమంగా లేవని, విద్యుత్‌స్తంభాలు కూడా లేవని ఈ సమస్యలన్నీ గుడ్‌మార్నింగ్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి కన్పించలేదా అని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ప్రశ్నించారు. బుధవారం పట్టణంలోని 3వ వార్డులో నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పరిటాలశ్రీరామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరుగుతూ మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తూ పథకాలగురించి వివరించారు. ఈ సందర్భంగా పరిటాలశ్రీరామ్ మాట్లాడుతూ 1 నుంచి 10వ వార్డులలో రోడ్లు సరిగాలేవని, విద్యుత్ స్తంభాలు కూడా సక్రమంగా లేవని అన్నారు. వీటిని పరిష్కరించకుండా గుడ్ మార్నింగ్ ఎమ్మెల్యే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రానున్న ఎన్నికలలో ఈ అవినీతి అరాచక ప్రభుత్వాన్ని ఓడించడానికి ప్రజలు సిద్దంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి రాళ్లపల్లి షరీఫ్, టీడీపీ యూనిట్ ఇన్‌ఛార్జి కరెంటు ఆది, నాయకులు మేకల లోకేశ్, రఫీ, నాగేంద్ర, ఓబుళేసు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల పనితీరు మెరుగవ్వాలి

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

అంగన్వాడీ కేంద్రాల పనితీరు మరింత మెరుగవ్వాలని కలెక్టర్ అరుణ్ బాబు సూచించారు. బుధవారం నాడు కలెక్టరేట్లోని స్పందన సమావేశ మందిరంలో అంగన్వాడీ కేంద్రాల పనితీరుపై ఐసిడిఎస్ అధికారులతో నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ కొండయ్య, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మీకుమారి, సిడిపిఒలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు. వైయస్సార్ సంపూర్ణ పోషణ పిల్లల పెరుగుదల, బరువు తక్కువగా ఉండే పిల్లల కోసం తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 12 ఐసిడిఎస్ ప్రాజెక్టులు 2824 అంగన్వాడి కేంద్రాల పరిధిలో 0 నుంచి 5 ఏళ్ల పిల్లలు 3993 మంది ఉన్నట్లు గణాంక వివరాలు ఉన్నాయన్నారు. జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల పనితీరు మరింత మెరుగు పరుచుకోవాలన్నారు. వీటిపై తాను క్షేత్ర స్థాయిలో పర్యటిస్తానని చెప్పారు. మొదట 15 రోజుల్లో భాగంగా పోషక ఆహారాల పంపిణీ పూర్తిస్థాయిలో జరగాలన్నారు. ప్రతి మాసం చివరి వారంలో ఆయా ప్రాజెక్టులకు సంబంధించి ముందస్తు ప్రణాళికాబద్ధకంగా చర్యలు చేపట్టాలని ఐసిడిఎస్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. పిల్లల పెరుగుదల, బరువు వివరాలు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. హిందూపురం, ఓడిసి, పెనుగొండ, బత్తలపల్లి సిడిపిఒలు సమావేశానికి గైర్హాజరు కావడం పట్ల వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో ప్రగతి నివేదికతో పాటు గర్భిణులు, బాలింతలు, పిల్లలకు మంచి పోషక ఆహారం అందించాలని ఆదేశించారు. ప్రతినెలా ఐసిడిఎస్ పురోగతిపై సమీక్షిస్తామని చెప్పారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ఫలించిన చర్చలు... దీపికకు జై కొట్టిన ఇంద్రజ

ప్రజాశక్తి-హిందూపురం

వైసిపి హిందూపురం ఇన్‌చార్జిగా దీపిక, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ మధ్య నెలకొన్న కోల్డ్ వార్‌కు తెరపడింది. దీపిక ఇన్‌ఛార్జిగా వచ్చినప్పటి నుంచి నెలకొన్న కోల్డ్‌వార్‌లో భాగంగా దీపిక సై అంటే ఇంద్రజ సైసై అంటూ కొనసాగింది. చైర్‌పర్సన్ తనకు జరుగుతున్న అన్యాయంపై జిల్లా అధ్యక్షులు, పెనుకొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణతో పాటు అనంతపురం ఎంపీ రంగయ్యకు వివరించింది. వారి సూచనల మేరకు వాల్మీకి, బోయ కార్పొరేషన్ ఛైర్మన్ పొగాకు రామచంద్ర, వైసిపి నాయకులు వేణు రెడ్డి, బాబు రెడ్డి బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని చైర్‌పర్సన్ చాంబర్‌లో చర్చలు జరిపారు. ఈ చర్చలు ఫలించాయి. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతు తమ పార్టీలో వర్గాలు లేవన్నారు. అందరిది ఒకే లక్ష్యం అని 2024 ఎన్నికల్లో టిడిపి కంచుకోటలో వైసిపి జెండా ఎగర వేసి దీపికను గెలిపించుకుంటామని అన్నారు. హిందూపురం నియోజకవర్గం ఇప్పటి వరకు టిడిపికి అడ్డాగా ఉందని అయితే దీనిని జగన్ అడ్డాగా మారుస్తామని అన్నారు. ఇప్పటికే చెలివెందుల ఎన్నికల్లో గెలిచి చూపించామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మారుతీరెడ్డి, అయూబ్, ముస్తక్, రహమత్ బి, నాయకులు బాబు, షఫి, మార్కెట్ చాంద్ బాష, సిఎన్‌పి నాగరాజు, సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వేణు రెడ్డి, బాబు రెడ్డి తదితరులు

అవార్డు గ్రహీతలకు సన్మానం

ప్రజాశక్తి-హిందూపురం

మండలంలోని ఎంఆర్‌సి లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్త ఉద్యోగులుగా గుర్తించి, వారికి అవార్డులు అందజేశారు. దీంతో బుధవారం పట్టణంలోని మండల విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవార్డు గ్రహీతలైన తౌసిఫ్ ఖాన్, ఫైరోజా, లలిత, వెంకటేష్ తదితరులను సన్మానించారు. ఈసందర్భంగా ప్రవేటు స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు, జిల్లా నాయకులు వేణుగోపాల్, రీయాజ్ తదితరులు మాట్లాడుతు నిబద్దతతో విధులు నిర్వహిస్తే గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ గంగప్ప, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం నాయకులు దీపు, ప్రసాద్, ముస్తఫా, ఆలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ నాయకులు

ఉద్యానవనాల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణ వ్యాప్తంగా ఉన్న ఉద్యానవనాలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని 10వ వార్డు లక్ష్మిపురంలో ఉండే ఉద్యానవనాన్ని కమిషనర్ పరిశీలించారు. అనంతరం అదే వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని రహమత్ పురం సర్కిల్ మారెమ్మ గుడి వీధిలో నివాసం ఉంటున్న గోవింద అనే వ్యక్తికి పక్షవాతం సోకింది. వైద్య సేవలు పొందడానికి ఆర్థిక స్థోమత లేక పోవడంతో పాటు కుటుంబ పోషణ కష్టంగా మారింది. ఇది తెలుసుకున్న ఆగ్రోస్ చైర్మేన్ నవీన్ నిశ్చల్ బుధవారం తన కార్యాలయంలో బాధితులకు రూ.20వేలు ఆర్థికసాయం అందజేశారు. దీంతో బాధితులు నవీన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఖాద్రీశుడికి కళ్యాణోత్సవం

కదిరి టౌన్ : ఖాద్రీ నరసింహస్వామి ఆలయంలో బుధవారం ఆర్జిత కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాఠశాల అభివృద్ధికి చేయూత



హెచ్‌ఎంకు విరాళం అందజేస్తున్న గుండుమల తిప్పేస్వామి

ప్రజాశక్తి మడకశిర

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పే స్వామి తాను చదివినఉన్నత పాఠశాలకు చేయూతను అందించారు. గుడిబండ మండలం మందలపల్లి ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి తన వంతుగా రూ 50వేలను బుధవారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎనిమిదవ తరగతి నుంచి పదవ తరగతి వరకు మందలపల్లి ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేసినట్లు చెప్పారు. పాఠశాల అభివృద్ధికి తనవంతుగా సాయం చేయాలన్న ఉద్దేశ్యంతో రూ 50వేల మొత్తాన్ని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. శ్రీనివాస్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో గుడిబండ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, రొళ్ల దాసిరెడ్డి, ఈరన్న, రామకృష్ణ, మందలపల్లి సర్పంచి సన్నమారప్ప, నియోజకవర్గ బీసీ సెల్ కార్యదర్శి పురుషోత్తం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే రెండు రోజుల్లో పూర్తి

పుట్టపర్తి అర్బన్ : స్పెషల్ సమ్మర్ రివిజన్ 2024లో భాగంగా ఇంటింటి సర్వే రెండు రోజుల్లో పూర్తి చేస్తామని కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కదిరి మున్సిపాలిటీలో రెండు చోట్ల ఓట్లు ఉంటే వాటిని తొలగించామన్నారు. ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేపట్టడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం, కదిరి, హిందూపురం, పుట్టపర్తి, మడకశిర, పెను కొండ, నియోజకవర్గాల సహా ఎన్నికల అధికారులు తిప్పే నాయక్, రాఘవేంద్ర, నరసయ్య, భాగ్యరేఖతో పాటు సిపిఎం వెంకటేష్, గంగాధర్, సిపిఐ వేమయ్య యాదవ్, రాము, కుళ్లాయప్ప, వైసీపీ రంగారెడ్డి, సుబ్బారాయుడు, ఎన్నికల డిప్యూటీ తాసిల్దారు మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి చెత్త సేకరణను వందశాతం అమలు చేయాలి

ప్రజాశక్తి-హిందూపురం

ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని వందశాతం అమలు చేయాలని ప్రతి రోజు ఉదయం సమయంలో కార్మికుల హాజరు సమయంలో శానిటేషన్ కార్యదర్శులు తప్పక హాజురు కావాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ సూచించారు. మంగళవారం కార్మికుల హాజరు సమయంలో కమిషనర్ ఆకస్మిక తనిఖీ చేశారు. కార్మికులు విధుల్లో ఉన్నా సమయంలో తప్పకుండా వారికి కేటాయించిన పరిధిలో ఉండాలన్నారు. ఇంటింటి చెత్త సేకరణ 100 అమలు చేయాలన్నారు. టిప్పర్, ట్రాక్టర్ ద్వారా చెత్తను తరలించే లోడ్‌ల సంఖ్యను మెరుగు పర్చాలన్నారు. అదే విధంగా శానిటేషన్ కార్యదర్శులు యూజర్స్ చార్జీలను వంద శాతం వసూలు చేయాలన్నారు. పని విభజన చేసి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. శానిటేషన్ కార్యదర్శులు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు,

మంత్రి పర్యటనను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి-హిందూపురం

ఈ నెల 25న పట్టణంలో నూతనంగా నిర్మాణం చేసిన వైసిపి కార్యాలయ ప్రారంభానికి వస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి పర్యటనను అందరం కలిసి విజయవంతం చేద్దామని వైసిపి నాయకులు వేణు రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి స్థానిక కార్యాలయంలో నియోజక వర్గ వ్యాప్తంగా ఉన్నా ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ ఛైర్మన్లు జబివుల్లా, బలరామిరెడ్డి, నాయకులు హనుమంతరెడ్డి, శ్రీరామి రెడ్డి, ఆనంద్, సిపిసి సాధిక్, చాంద్‌బాషా, కౌన్సిలర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

మడకశిర: పట్టణంలోని రాజీవ్ గాంధీ సర్కిల్లో మరుగుదొడ్ల భవన నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ తనయుడు జయరాజు ఈ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో ప్రెసిడెంట్ రామిరెడ్డి , వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ వెంకటలక్ష్మమ్మ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

లేపాక్షి : ప్రజాసమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని వైసిపి హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త దీపిక వేణు అన్నారు. మండలం పరిధిలోని కల్లూరులో బుధవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వసుంధర, జెడ్పీటీసీ శ్రీనివాసులు రెడ్డి, ఎంపీడీవో నరసింహ నాయుడు, కన్వీనర్ నారాయణ స్వామి పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే వైసిపి ధ్యేయం

మడకశిర : ప్రజాసంక్షేమమే వైసిపి ధ్యేయమని వైసిపి ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షులు ఎం. నరసింహులు అన్నారు. పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. మరోసారి ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి కొనసాగాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేగా కూడా గెలవలేని పవన్ కళ్యాణ్ కేవలం జగన్మోహన్ రెడ్డిని ప్రతి సమావేశంలో తిట్టడానికి సమయం సరిపోతుందని విమర్శించారు. 2024 ఎన్నికల్లో తిరిగి వైసిపి అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాయకులు వెంకట రంగారెడ్డి, చంద్ర చర్ల శివన్న, తిప్పన్న, తిమ్మప్ప, బేకరి నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

యానిమేటర్ల సమస్యలు పరిష్కరించాలి

సోమందేపల్లి : యానిమేటర్ల సమస్యలు పరిష్కరించాలని మండలంలోని యానిమేటర్లు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపిడిఒ రామాంజనేయులుకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యానిమేటర్లకు 25వేల రూపాయల వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. జెండర్ విధానాన్ని రద్దు చేయాలని, మూడు సంవత్సరాల కాల పరిమితిని తీసివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రమీల, లీలావతి, చంద్రకళ, భారతి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

తనకల్లు : మండల పరిధిలోని కసనివారిపల్లి వద్ద ఉన్న ధనకొండ గంగమ్మ ఆలయ అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే కందికుంటవెంకట ప్రసాద్ విరాళం అందజేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆలయ అభివృద్ధికి 1,01,116లు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, మాజీ మండల కన్వీనర్ బీగం శంకర నాయుడు దుగినేపల్లి శ్రీధర్ రెడ్డి,గంగిరెడ్డి, నరసింహా రెడ్డి,వెంకట మల్లప్ప నాయుడు, సోంపాలెం నాగభూషణ నాగేంద్ర ప్రసాద్, మల్లికార్జున, చిన్నప్ప, రవీంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు తప్పనిసరి

నంబులపూలకుంట : ఖరీఫ్ 2023 సంబంధించి పంట సాగుచేసిన రైతులు ఈ పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి లోకేశ్వర్ రెడ్డి తెలిపారు.మండల వ్యాప్తంగా 3567 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు చేసినట్లు ఆయన చెప్పారు.

ఎంపిడిఒగా రామునాయక్

గాండ్లపెంట : ఎంపీడీవోగా కె. రామునాయక్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఈసందర్భంగా ఆయనకు నాయకులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

పేద విద్యార్థికి చేయూత

కదిరి అర్బన్ : మండల పరిధిలోని చౌటికొండూకు చెందిన పీరే నాయక్ కుమారుడు సునీల్ నాయక్ విద్యాభివృద్ధికి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి తన వంతు చేయూతను అందించారు. ఇచ్చిన మాట ప్రకారం విద్యార్థికి లాప్‌టాప్‌ను స్థానిక నాయకుల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దుదాం



ప్లాస్టిక్ సేకరణను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ధర్మవరం పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజల సహాయ సహకారాలు ఎంతో అవసరమని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర క్రీడా మైదానంలో ప్లాస్టిక్ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని పాఠశాలలు, కళాశాలలు, పట్టణంలోని వార్డు సచివాలయాలు కూడా ప్లాస్టిక్‌ని సేకరించారు. దాదాపు మూడు గంటల సేపు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గరుండి ప్లాస్టిక్ తూనికలను వేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని శివానగర్‌కు చెందిన బ్రిలియంట్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ వారు అత్యధికంగా 1,093 కేజీలు సేకరించి మొదటి బహుమతిగా 50వేల రూపాయలు, రెండవ బహుమతిగా జీవన్ జ్యోతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ వారు రూ. 30వేలు, కొత్తపేటలోని ఉషోదయ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ వారు తృతీయ బహుమతిగా 20 వేల రూపాయలు గెలుచుకున్నారు. ఇక సచివాలయాలలో దుర్గా నగర్ సచివాలయం–2 వారు మొదటి బహుమతిగా 50వేల రూపాయలు, రెండవ బహుమతిగా ఎల్పికేపురం సచివాలయం వారు 30 వేల రూపాయలు, మూడవ బహుమతిగా 11వ సచివాలయం వారు 20 వేల రూపాయల నగదును ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యాసంస్థల ద్వారా మూడు టన్నులు, సచివాలయాల ద్వారా నాలుగున్నర టన్నులు ప్లాస్టిక్ వచ్చిందన్నారు. ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అటు ప్రజలది, ఇటు అధికారులది అని తెలిపారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిమీద ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, మున్సిపల్ చైర్మన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్లు వేముల జయరాంరెడ్డి,షేక్ షంషాద్ బేగం, వైసిపి జిల్లాఅధికార ప్రతినిధి గుర్రం శ్రీను, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, పెనుజూరి నాగరాజు, కో ఆప్షన్ నెంబర్లు, పట్టణ వార్డు కౌన్సిలర్లు, పట్టణ వార్డు ఇన్‌ఛార్జులు, మున్సిపల్ మేనేజర్ ఆనంద్, టీపీఆర్వో సుబ్బారాయుడు, ఇంజనీరింగ్ విభాగం ఈఈ సత్యనారాయణ, డీఈ వన్నూరు స్వామి, శానిటరీ ఇన్స్పెక్టర్లు మహబూబ్ బాషా, శ్యాంసన్, పార్థసారధి, నాలుగు డివిజన్ల మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆశలపై నీళ్లు చల్లిన సిఎం : సిఐటియు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

స్వయానా ముఖ్యమంత్రి ఏర్పాటుచేసిన సభలో ఉద్యోగస్తులకు వరాలు జల్లు కురిపిస్తారని ఎంతో ఆశతో ఎదురుచూసిన ఉద్యోగులకు నిరాశ మిగిలిందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ కార్మికులకు 2022 లోనే రావాల్సిన డిఎ బకాయి 2023 దసరాకి ఇస్తానని చెప్పడం కొట్టించారంటే ఎంతవరకు సమస్యలు పరిష్కారం చేస్తారో అర్థమైందన్నారు. మహిళ ఉద్యోగులకు 5 రోజుల సెలవులకు సంబంధించి ఇచ్చేసిన జీవో గురించి తిరిగి చెప్పించారంటేనే మహిళల పట్ల ఎంత చిత్త శుద్ధి ఉందో కూడా అర్థం అవుతుందన్నారు. పిఆర్‌సి గడువు లోగా ఇస్తారా అన్న ఊసే లేదన్నారు. అందాక ఐఆర్ ఇవ్వాలన్న విషయం భజనపరులకు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. వైద్య ఆరోగ్య శాఖ మహిళలకు మొబైల్ యాప్స్ తగ్గించాలని అడగనేలేదన్నారు. సచివాలయ ఉద్యోగులకు రావాల్సిన 9 నెలల బకాయిల గురించి మాట్లాడలేదని విమర్శించారు.అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల గురించి మాట్లాడకపోవడం విడ్డూరకరమని అన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల గోడును పట్టించుకోకపోతే వాళ్ల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

డిక్లరేషన్ అమలు చేసే పార్టీకే మద్దతు

హిందూపురం : ముస్లిం సామాజిక వర్గ అభివృద్ధికోసం రచించిన ఆంధ్రప్రదేశ్ ముస్లిం డిక్లరేషన్‌ను ఏ పార్టీ అమలు చేస్తుందో ఆ పార్టీకే ముస్లిం సోదరులు సంపూర్ణ మద్దతు ఇస్తామని డాక్టర్ జాకీర్ హుస్సేన్ అన్నారు. బుధవారం పట్టణంలోని డాక్టర్ జాకీర్ హుస్సేన్ రచించిన ఆంధ్రప్రదేశ్ ముస్లిం డిక్లరేషన్ 2024 పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ముస్లిం సంఘాలన్నీ కలిసి ఒక పుస్తకాన్ని రూపొందించడం జరిగిందన్నారు. ఇందులో ముఖ్యంగా రంగనాథ్ మిశ్రా కమిషన్, సచార్ కమిటీ సిఫార్సులు అమలు చేస్తూ రాజకీయ, ఉద్యోగ, విద్యా రిజర్వేషన్లు కల్పించాలని అదే విధంగా రాబోయే ఎన్నికల్లో 13 ఎమ్మెల్యే సీట్లు, మూడు ఎంపీ సీట్లను ముస్లింలకు కేటాయించాలని కోరాయన్నారు. వక్ఫ్ బోర్డు ప్రక్షాళన చేసి కమిషనరేట్ ఏర్పాటు చేయాలని ఉర్దూ విద్యాభివృద్ధి కోసం పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరామన్నారు. ఈ పుస్తకంలోని అంశాలను ఏ రాజకీయ పార్టీ అయితే అమలు చేస్తుందో వాళ్లకే ముస్లిం సమాజం మద్దతు ఇస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సామాజిక చైతన్య ఉద్యమ కారులు, ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ చైర్మన్ దస్తగిరి, యంగ్ ఇండియా ప్రాజెక్ట్ ప్రెసిడెంట్ షఫీ, సయ్యద్ వలి, సయ్యద్ అతిక్ అహ్మద్, సయ్యద్ రఫీక్, ఫయాజ్ భాషా, షౌకత్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ నిర్లక్ష్యం ... మహిళల ఆందోళన

ప్రజాశక్తి గాండ్లపెంట

స్థానిక తహశీల్దార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండల పరిధిలోని కురుమామిడి సచివాలయం వద్ద మహిళలు బుధవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మహిళలు లక్ష్మీదేవి, సరస్వతితో పాటు నాయకులు బికె. శంకర్ నాయుడు మాట్లాడుతూ వైఎస్ఆర్ చేయూతకు అవసరమయ్యే ధ్రువపత్రాల కోసం తహశీల్దార్ కార్యాలయానికి వెళితే తహశీల్దార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పకడ్బందీగా గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని జూనియర్ కళాశాలలు, ప్రాథమిక ,ఉన్నత పాఠశాలల విద్యార్థుల గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వేను నిర్వహించాలని ఎంపీడీవో అశోక్ కుమార్ రెడ్డి సూచించారు. ఈ మేరకు పుట్టపర్తి ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఎమ్మార్సీ సిబ్బంది, సీఆర్పీలతో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు డేటాను పరిశీలించి అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి ఎస్ డబ్ల్యూఎస్ నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, ఎంఇఒ 2 ప్రసాద్, డిఐఇఒ రఘునాథరెడ్డి, ఆర్ఐఒ సురేష్, గ్రామీణ పట్టణ గ్రామ సచివాలయాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్లు, కొత్తచెరువు మండలం వెల్ఫేర్ అసిస్టెంట్లు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

కోతలు లేని విద్యుత్ సరఫరా చేయాలి

ముదిగుబ్బ : కోతలు లేని విద్యుత్‌ను సరఫరా చేయాలని మండలంలోని పలు గ్రామాల రైతులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎడి ఆనంద్, ఎఇ శివతేజకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 10 రోజుల నుండి అప్రకటిత విద్యుత్‌కోతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. లో వోల్టేజీ సమస్య వల్ల మోటర్లు కాలిపోయి వేలాది రూపాయలు నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో సబ్ స్టేషన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు దేవేందర్ రెడ్డి , కంఠగాని నారాయణస్వామి, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - ముదిగుబ్బ


పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌తో చేపట్టిన ధర్నాకు సంబందించి గ్రామ కార్యదర్శి మంజులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు

చిలమత్తూరు : గ్రామపంచాయతీ కార్మికులు,స్వచ్ఛ భారత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో గురువారం నుంచి 3 రోజులు పాటు చేపట్టిన సమ్మె కు సంబందించిన నోటీసును ఎంపిడిఒకు అందజేశారు. సిఐటియు జిల్లా నాయకులు ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎంపిడిఒ నరేష్‌క్రిష్ణకు నోటీసును అందజేశారు. తమ సమస్యలు పరిష్కారం కోసం తాము సమ్మెలోకి వెలుతున్నట్లు కార్మికులు తెలిపారు. ఈ కార్యక్రమం లో నాయకులు వెంకటేష్, లక్ష్మినారాయణ, గౌస్, శీన, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మినీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - తనకల్లు

మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ లో బుధవారం తెలుగుదేశం పార్టీ నాయకులు మినీ మేనిఫెస్టో గురించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, గేమే నాయక్ తండా సర్పంచి మూడే కాంతమ్మ, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సోంపాల్యం నాగభూషణ, రాష్ట్ర ఎస్‌టి సెల్ భూక్యహరి నాయక్, కో కన్వీనర్ బ్రహ్మానంద రెడ్డి, ఉత్తన్న నాయక్, క్లస్టర్ ఇన్‌ఛార్జి మల్లికార్జున, జెరిపిటి రవి, బిసిసెల్ శంకర్ నాయుడు, ఎస్సీ సెల్ చిన్నప్పతదితరులు పాల్గొన్నారు.



ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు

ఇస్రో శాస్త్రవేత్తల కృషి అభినందనీయం

ప్రజాశక్తి - కదిరి టౌన్

చంద్రయాన్ 3 విజయవంతంలో శాస్త్ర వేత్తల కృషి అభినందనీయమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంది కుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరిక్ష చరిత్రలో భారత్ సరికొత్త అధ్యాయం లిఖించిందన్నారు. చంద్రుడి దక్షిణ ధృవంపై అడుగుపెట్టిన తొలి దేశంగా భారతదేశం నిలవడం సంతోషంగా ఉందన్నారు. ఇస్రో సాధించిన విజయం చారిత్రాత్మకంగా నిలుస్తుందని తెలిపారు.

మడకశిర : నూట నలభై కోట్ల ప్రజల ఆకాంక్ష నెరవేరిందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి అన్నారు. పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇస్రో చరిత్ర సృష్టించిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గుడిబండ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, రొళ్ల దాసిరెడ్డి, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.



ఖాళీబిందెలతో రాస్తారోకో చేస్తున్న మహిళలు

తాగునీటి కోసం రోడ్డెక్కిన కాలనీవాసులు

మడకశిర : పట్టణ సమీపంలోని చౌటుపల్లి కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆ కాలనీవాసులు బుధవారం రోడ్డుపై బైటాయించారు. ఈసందర్భంగా పెనుకొండ మడకశిర ప్రధాన రహదారిలో కాలనీవాసులు రోడ్డుపై ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో తీవ్ర తాగునీటి సమస్య నెలకొన్నా సంబంధిత అధికారులు కానీ ప్రజా ప్రతినిధులు కానీ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని వారు కోరారు.

ఉపాధ్యాయులు విద్యార్థులను
ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి బుక్కపట్నం


ఛాత్రోపాధ్యాయులు ఉపాధ్యాయ వృత్తి చేపట్టి విద్యార్థులను బావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వ జిల్లా శిక్షణ సంస్థ ప్రిన్సిపల్ రామకృష్ణ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు స్వాగత ఏర్పాటు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ రెండు సంవత్సరాల శిక్షణ కాలంలో ఛాత్రోపాధ్యాయులు తీసుకున్న శిక్షణను ఉపాధ్యాయ వృత్తి చేపట్టిన తర్వాత విద్యార్థులకు మెలకువతో కూడిన విద్యను అందించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆటపాటలు, కళానృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టంగుటూరి జీవితం ఆదర్శనీయం

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

నిరుపేద కుటుంబంలో జన్మించి స్వాతంత్ర సమరయోధుడిగా బ్రిటిష్ వారికి రొమ్ము చూపిన ధీరోత్తమ్ముడు టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం ఆదర్శనీయమని కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. టంగుటూరి జయంతి సందర్భంగా బుధవారం కలెక్టరేట్ లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ కొండయ్య, అగ్రిగోల్డ్ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, పుడా చైర్ పర్సన్ లక్ష్మ నరసమ్మ, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి నిర్మల జ్యోతి, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, హౌసింగ్ పీడీ చంద్ర మౌళి రెడ్డి, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్‌వి కృష్ణారెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 152 వ జయంతి వేడుకలను, తెలుగు వ్యవహారిక బాషా పితహమహుడు శ్రీ గిడుగు రామమూర్తి ముందస్తు జయంతి వేడుకలు పుట్టపర్తి లోని జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ మాధవ్ రెడ్డి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు దేశానికి ,రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు. ప్రమాదం ఉన్నచోటే ప్రకాశం పంతులు ఉంటారన్న భోగరాజు పట్టాభి సీతారామయ్య మాటలు మాటలే ప్రకాశం పంతులు పోరాట శైలి, వ్యవహార శైలికి అద్దం పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు అదనపు ఎస్పీ ఎన్.విష్ణు , ఎఆర్ డిఎస్‌పి విజయ్ కుమార్, ఎఎఒ సుజాత , ఆర్ఐలు టైటస్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.




పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎస్పీ

కాంగ్రెస్‌కు పూర్వవైభవం తెద్దాం...

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ధర్మవరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడమే తమ లక్ష్యమని ఆపార్టీ నియోజకవర్గ కన్వీనర్ కెఎస్ షాన్వాజ్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమన్వయ కమిటీ సభ్యులు రంగన అశ్వర్థనారాయణ ఆధ్వర్యంలో కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. మాజీ మంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షులు రఘువీరారెడ్డి కాంగ్రెస్ వర్కింగ్ కమిటి సభ్యులుగా ఎంపికైన సందర్భంగా సంబరాలు చేసుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ దేశంలోనే కాంగ్రెస్ పార్టీకి ఎంతో గుర్తింపు ఉందన్నారు. ఆ గుర్తింపును వచ్చే ఎన్నికలలో విజయానికి కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బదిరి నారాయణ, చైతన్య, గణేశ్, మైనార్టీనాయకులు తాహీర్, మునాఫ్, షరూక్, మామిళ్లరంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : కాంగ్రెస్ పార్టీ హిందూపురం పార్లమెంట్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే సుధాకర్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని నీలకంఠ కోల్డ్ స్టోరేజ్‌లో ఐదు మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుధాకర్ మాట్లాడుతూ మాజీ మంత్రి రఘువీరారెడ్డి సిడబ్ల్యూసి మెంబర్‌గా ఎన్నిక కావడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఈ నెల 25న ఆయన పట్టణానికి వస్తున్న సందర్భంగా భారీ ఎత్తున స్వాగతం పలకాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తులో మంచి ఆదరణ పొందుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు దీన్నే హట్టి నాగరాజు, వరదరాజులు, లోకేష్, గౌడప్ప, మంజునాథ్ గురుమూర్తి, సీనియర్ నాయకులు బచ్చలాయపాలెం నరసింహమూర్తి, సురంగల నాగరాజు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తనకల్లు : మండల పరిధిలోని దేవళం తండా వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొని స్కూటీలో వెళుతున్న ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మదనపల్లి తారకరామ నగర్ నుండి పెనుకొండ బాబా దర్గాకు ఖాజాపీర్, అతని భార్య హసీనా, కుమార్తె యాసిన్ స్కూటీలో వెళుతుండగా పెనుకొండ వైపు నుండి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం స్కూటీని ఢీకొంది. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న ఖాజాపీర్(56) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మృతుని భార్యను, కుమార్తెను కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాంభూపాల్ యాదవ్ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

హిందూపురం : పట్టణ పరిధిలోని కొట్నూరుకొల్లకుంటలో మహిళ ఆత్మహత్య చేసుకుంది. కాలనీకి చెందిన వడ్డే సుశీలమ్మ (45) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సుశీలమ్మ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

వృద్ధుడికి గాయాలు

చిలమత్తూరు : మండల పరిధిలోని శిర రహదారి పై కనుమ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్నాటక రాష్ట్రం బాగేపల్లి తాలుక పులగూర్లపల్లికి చెందిన వృద్ధుడు గంగిరెడ్డికి గాయాలు అయ్యాయి. గంగిరెడ్డి హిందూపురం వైపు నుండి చిలమత్తూరు వైపు సూపర్ ఎక్సెల్ లో వస్తుండగా వెనుక నుండి స్కూటీ ఢీకొంది. ఈ ప్రమాదంలో వృద్ధుడికి కాలు విరిగింది. స్థానికులు 108 సాయంతో హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

భూవివాదంలో వృద్ధుడిపై దాడి

గోరంట్ల రూరల్ : గోరంట్ల మండలంలోని బూదిలి పంచాయతీ బి గొల్లపల్లి వద్ద నెలకొన్న భూ వివాదంలో వృద్ధుడిపై దాడి జరిగింది. బంధువులతో ఎనిమిది నెలలుగా నడుస్తున్న వివాదంలో భాగంగా నలుగురు వ్యక్తులు మంగళవారం రాత్రిలో తాను పశువుల షెడ్డులో పడుకొని ఉండగా దాడి చేశారని బాధితుడు గొల్లపల్లికి చెందిన వెంకటరామప్ప తెలిపారు. ఈ వివాదంపై బాధితుడి నుండి ఫిర్యాదు అందగానే విచారణ చేస్తామని సిఐ సుబ్బరాయుడు తెలిపారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

గాండ్లపెంట : స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ మాధవరెడ్డి బుధవారం తనిఖీ చేశారు. పెండింగ్ కేసులు, నేర చరిత్రలో ఉన్న వారి వివరాల గురించి ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కదిరి డీఎస్పీ శ్రీలత, రూరల్ సిఐ శంకర్ నాయక్, జమేదారులు రామయ్య, శ్రీనివాసులు, సిబ్బంది భాస్కర్ రాజు, నాగరాజు, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు

వామపక్ష నాయకుల అరెస్టులు అక్రమం

ముదిగుబ్బ : వామపక్ష నాయకులు అరెస్టులు అక్రమమని సిపిఐ మండల కార్యదర్శి చల్ల శ్రీనివాస్ అన్నారు. మున్సిపాలిటీ, పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని భగ్నం చేయడానికి ముదిగుబ్బ పోలీసులు ముందస్తు అరెస్టుల్లో స్థానిక వామపక్ష నాయకులకు నోటీసులు అందజేశారు. సిపిఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు, శంకర్‌తో పాటు సిఐటియు ఆటో పెద్దన్న, మధుసూదన్ రెడ్డి తదితరులకు నోటీసులు అందజేశారు.

బస్సుయాత్ర పోస్టర్లు విడుదల

కదిరి టౌన్ : ప్రజా సమస్యలపై సిపిఐ చేపట్టిన ప్రచార బస్సు యాత్ర జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య కోరారు. ఈ మేరకు సిపిఐ ప్రచార జాత బస్సు యాత్రకు సంబంధించిన పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం వేమయ్య మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పాలకులు ప్రజా సేవకులు అవ్వాలని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా ఇస్తామని మోసం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఇసాక్, రాజేష్, బిళ్ళు కుళ్లాయప్ప, మధు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి వాణిజ్య విభాగం నియోజకవర్గ కమిటీ ఏర్పాటు

మడకశిర : టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి సమక్షంలో మడకశిర నియోజకవర్గ వాణిజ్య విభాగం కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా కట్ట కిషోర్, ప్రధాన కార్యదర్శిగా వాదిరాజు, మండల అధ్యక్షులుగా వైబి హళ్లి సత్యనారాయణ గుప్తాను నియమించారు.

పేదలను సంపన్నులు చేయడమే టిడిపి ధ్యేయం

మడకశిర: పేదలను సంపన్నులు చేయడమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి తెలిపారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో రొళ్ళ మండలం బిజి హల్లిగ్రామంలో బుధవారం మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి తిరిగి, టీడీపీ ప్రత్యేకంగా రూపొందించిన భవిష్యత్తుకి గ్యారెంటీ పథకాలను వివరించారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ దాసిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఈరన్న, తెలుగు యువత అధ్యక్షులు బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో జీవించాలి...

సోమందేపల్లి : గ్రామాలలోని ప్రజలు చిన్నచిన్న సమస్యలతో పోలీస్ స్టేషన్ల చుట్టూ, కోర్టుల చుట్టూ తిరుగుతూ ఘర్షణ వాతావరణంలో జీవించడం సరైన పద్ధతి కాదని సమస్యలు పరిష్కారం చేసుకుంటూ ప్రజలు ప్రశాంతంగా జీవించాలని సుప్రీం కోర్ట్ న్యాయవాది ఎం వెంకటేశులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ఉన్న రెడ్డి కాంప్లెక్స్‌లో ఆయన నూతన కార్యాలయాన్ని స్థానిక ఎస్ఐ విజయ్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు. మండలంలోని ప్రజలు న్యాయ సలహాలు సూచనలు పరిష్కార మార్గాల కోసం తమ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ నాయకులు హరి, తదితరులు పాల్గొన్నారు.

జగన్ చిత్రపటానికి పాలాభిషేకం

పుట్టపర్తి క్రైమ్ : డిఆర్‌డిఎ, వెలుగు స్థానిక ఉద్యోగులు జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. 23 శాతం ఫిట్‌మెంట్ పెంచినందుకు బుధవారం శాసనసభ్యుడు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డిని సన్మానించారు.

హిందూపురం : రాష్ట్ర ప్రభుత్వం 23శాతం ఫిట్‌మెంట్ ఇవ్వడంపై డిఆర్‌డిఎ వైకెపిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం వైసిపి కార్యాలయంలో ఇన్‌ఛార్జి దీపిక వేణు రెడ్డిలను కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ రామిరెడ్డి, ఎపిఎం రామకృష్ణ, భారతి, నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న సిసిలు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు పాత్రికేయుల కృతజ్ఞతలు

పుట్టపర్తి అర్బన్ : జర్నలిస్టుల పిల్లలకు కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత విద్య సౌకర్యం కల్పించినందుకు జిల్లా జర్నలిస్టులు, స్పోర్ట్స్, కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు కలెక్టర్ అరుణ్‌బాబును బుధవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా వారు కలెక్టర్‌కు మొమెంటోను అందజేశారు. పుట్టపర్తిలో జర్నలిస్టుల సౌకర్యార్థం ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు స్థలం కేటాయింపుతో పాటు క్రీడలు నిర్వహించుకోవడానికి క్రీడా మైదానం ఏర్పాటుకు చొరవ తీసుకొని స్థలాలు మంజూరు చేయాలని కోరారు. అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ సంఘం నాయకులు విజయ్ కుమార్, శివరామకృష్ణ, వెంకటరంగారెడ్డి, పూల శ్రీనివాసులు, బసప్ప, కేశవరెడ్డి, నారాయణస్వామి, రాము, గోపాల్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.